సాక్షి అనకాపల్లి

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



సత్వర పరిష్కారమే లక్ష్యం

రోలుగుంటలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. 270 వినతులు అందాయి 8లో



ముగిసిన పవిత్రోత్సవాలు

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిశాయి.



ఎయిడ్స్ నియంత్రణకు కితాబు

విశాఖ: ఎయిడ్స్ నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కేంద్ర వైద్య బృందం సభ్యులు కితాబిచ్చారు.

భలే భలే.. బెల్లం కుల్ఫీ

- ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల వినూత్న ప్రయోగం
- పోషక విలువలతో బెల్లం ఉత్పత్తులు
- మునగాకు రసం, తేనె, నిమ్మరసం జత చేసి పొడి తయారీ
- యూపీ, మహారాష్ట్రలకు దీటుగా ఎగుమతులు
- తేమ శాతం తగ్గించి నిల్వ సామర్థ్యం పెంచేలా కృషి



విదేశాలకు ఎగుమతి చేసే బెల్లం పొడి





ఆల్మండ్ కుల్ఫీ, జాగరీ కుల్ఫీ, జాగరీ పౌడర్ కుల్ఫీలు

సాక్షి, అనకాపల్లి: పంచదారతో పోలిస్తే బెల్లంలో పోషక విలువలు అధికంగా ఉంటాయి. ఔషధ గుణాలకు కొదవ ఉండదు. జీర్ణశక్తిని పెంచడం.. రక్తహీనతను తగ్గించడం వంటి సుగుణాలెన్నో పుష్కలంగా ఉంటాయి. అలాంటి బెల్లం ఎగుమతుల్లో దేశంలోనే అతి పెద్ద మార్కెట్‌గా అనకాపల్లి బెల్లం మార్కెట్ గుర్తింపు తెచ్చుకుంది. దేశంలో యూపీ, మహారాష్ట్రలకు దీటుగా అనకాపల్లి బెల్లం ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఘనతకు తమ ప్రయోగాలతో ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు మరింత వన్నె తెస్తున్నారు. ఇప్పటికే ఘన బెల్లం, పొడి బెల్లం, లిక్విడ్ బెల్లం, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం ఓట్స్ బిస్కెట్లు, జెల్లీలు, చాక్లెట్లు, పల్లి చెక్కీలను రుచి చూపించిన అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు సరికొత్తగా బెల్లం కుల్ఫీలను కూడా తయారుచేస్తున్నారు. ప్రస్తుతం బెల్లం పొడిని వివిధ రాష్ట్రాలకు పంపిస్తున్నారు. విదేశాలకు కూడా ఎగుమతి చేసే యోచనలో ఉన్నారు.

గ్లూకోజ్, ఫ్రక్టోజ్, ఇతర లవణాలు, ప్రొటీన్ల వల్ల త్వరగా బూజు పట్టడం, నీరు కారటం జరుగుతుంది. ఇటువంటి కారణాల వల్ల బెల్లం నాణ్యత చెడిపోతుంది.

దీనిని నివారించేందుకు అనకాపల్లి చెరకు పరిశోధన స్థానం బెల్లాన్ని పొడి రూపంలో మార్చే సాంకేతికతను అభివృద్ధి చేసింది. అమెరికా, ఫిలిప్పీన్స్, కొలంబియా, ఇండోనేషియా దేశాల్లో డిమాండ్ ఉన్న తెల్లని బెల్లం పొడి, హెర్బల్, మూలిక, మునగ, తేనె, నిమ్మ బెల్లంపొడులను తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు.



అనకాపల్లి చెరకు పరిశోధన స్థానం

నిల్వ సామర్థ్యం పెంపొందించేలా..

బెల్లంలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. బెల్లం ఉత్పత్తులే ఎగుమతి అవుతున్నాయి గానీ బెల్లం విదేశాలకు ఎక్కువస్థాయిలో వెళ్లడం లేదు. బెల్లంలో 12 నుంచి 13 శాతం వరకు తేమ ఉంటుంది. దాన్ని 3 శాతానికి తగ్గించి.. అదనంగా మునగాకు రసం, తేనె, నిమ్మ రసాలను వాటిలో సమృద్ధిగా కలిపి బెల్లం పొడి తయారు చేస్తున్నారు. చెరకు రసాన్ని స్థిరీకరించిన మోతాదులో స్ప్రే డ్రయింగ్ ద్వారా పొడి రూపంలో మార్చి బెల్లంలో తేమ శాతాన్ని తగ్గించి వాటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా కృషి చేస్తున్నారు.

కుల్ఫీలకు మంచి డిమాండ్



జీర్ణ సంబంధిత రుగ్మతలను నివారించేలా.. అత్యధిక పోషక విలువలు పెంచేలా బెల్లం కుల్ఫీలు తయారు చేస్తున్నాం. మా బెల్లం కుల్ఫీలకు ఆర్డర్లు పెరుగుతున్నాయి. చిక్కని పాలు, బాదం, జీడిపప్పు, పిస్తా, ఇలాచి, బెల్లం పొడితో తయారు చేస్తాం. మా దగ్గర ఆల్మండ్ కుల్ఫీ, జాగరీ కుల్ఫీ, జాగరీ పౌడర్ కుల్ఫీలకు బాగా డిమాండ్ ఉంది. వాటి నిల్వ సామర్థ్యం పెరిగేలా తయారు చేయడం జరిగింది. జీర్ణ సంబంధిత రోగులతోపాటు డయాబెటిస్ రోగులు కూడా ఈ కుల్ఫీలను ఆస్వాదించవచ్చు.

– పి.వి.కె.జగన్నాథరావు, ఆర్‌ఏఆర్‌ఎస్ అసిస్టెంట్ డైరెక్టర్



వివిధ రకాల బెల్లం ఉత్పత్తులు

అందుబాటులో 9,414 మెట్రిక్ టన్నుల ఎరువులు

- జిల్లాలో ఇప్పటి వరకు 22,593 మెట్రిక్ టన్నుల సరఫరా



తుమ్మపాల: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు 9,414 మెట్రిక్ టన్నుల నిల్వ ఉందని, ఎక్కడైనా అధిక ధరలకు ఎరువుల్ని విక్రయిస్తే సంబంధిత మండల వ్యవసాయ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకునికి ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ సాగు విస్తీర్ణానికి అవసరమైన ఎరువుల మోతాదు 33,353 మెట్రిక్ టన్నులన్నారు. ఈ ఏడాది సాధారణ సాగు 62 శాతం, వరి 77 శాతం నాట్లు వేసినట్లు తెలిపారు. ఇప్పటికే 22,593 మెట్రిక్ టన్నుల ఎరువుల్ని సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో 8,810 టన్నుల ఎరువుల్ని ఆర్బీకేలు, సొసైటీల ద్వారా సరఫరా చేశామన్నారు. వరినాట్లుకు అవసరాన్ని బట్టి వెయ్యి టన్నుల యూరియా సరఫరా చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ అధికారుల తనిఖీల్లో భాగంగా యలమంచిలిలో అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరు ప్రైవేట్ డీలర్లపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎరువుల అధిక ధరలపై ఫిర్యాదు చేసేందుకు 83310 56383(అనకాపల్లి), 83310 56410(నర్సీపట్నం), 83310 56389 (యలమంచిలి), 83310 56402(చోడవరం), 83310 56395(పాయకరావుపేట) ఫోన్ నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

- పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలో ఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: వార్షిక తనిఖీల్లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్లలో రికార్డులను పరిశీలించడంతోపాటు పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని గ్రామీణ పోలీస్ స్టేషన్ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ ఉత్సవాల సమయంలో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టణం, మండలం, కశింకోట ప్రాంతాల్లో రాత్రి సమయంలో గస్తీకి బీట్ కానిస్టేబుళ్ల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. పెండింగ్ కేసులు, న్యాయస్థానం పరిధిలో ట్రయల్ కేసులతోపాటు, వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉంటూ తప్పించుకున్న వ్యక్తులపై నిఘా పెంచామన్నారు. జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్టాప్ బోర్డులతోపాటు సీసీ కెమెరాలు, స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి రోడ్డు ప్రమాదాల కేసులు 14 శాతం మేర తగ్గినట్లు వెల్లడించారు. పోలీసు సిబ్బంది అవగాహన కార్యక్రమాలతో ఆయా ప్రాంతాల ప్రజలు, వాహనదారుల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 45 ప్రధాన రోడ్డు ప్రమాదాల జోన్లలో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. గంజాయి రవాణాకు అడ్డకట్ట వేసేందుకు 11 చెక్‌పోస్టులతో పాటు నిత్యం జిల్లాలో తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, కరపత్రాల ద్వారా చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ వి.సుబ్బరాజు, రూరల్ సీఐ రవికుమార్, ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాల శిబిరానికి పోటెత్తిన దివ్యాంగులు

- 1580 మంది హాజరు.. 1050 మంది ఎంపిక



ఎంపిక శిబిరానికి హాజరైన దివ్యాంగులు

చోడవరం రూరల్: దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలను అందచేయడానికి బుధవారం నిర్వహించిన శిబిరంలో 1050 మందిని ఎంపిక చేశారు. అనకాపల్లి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆలిమ్‌కో సంస్థ సహకారంతో స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన గుర్తింపు శిబిరానికి 1580మంది దివ్యాంగులు హాజరయ్యారు. శిబిరాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు గాడి కాసులమ్మ ప్రారంభించగా ఎంపీడీవో బి.చైతన్య కార్యక్రమం ఉద్దేశాన్ని, ఉపకరణాల పంపిణీ ఎంపిక కోసం పాటిస్తున్న నిబంధనలను వివరించారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఎ.డి.జి.వి.బి.జగదీష్ పర్యవేక్షణలో కళాశాల మెయిన్ హాలులో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలలో దివ్యాంగుల నమోదును చేపట్టారు. దీని కోసం ఐదు వరకు డేటా ఎంట్రీ కౌంటర్లను ఏర్పాటు చేశారు. శిబిరానికి చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల నుంచి దివ్యాంగులు చేరుకోవడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలిమ్‌కో వైద్య బృందం దివ్యాంగులకు విభాగాల వారీగా పరీక్షలు నిర్వహించి, గత మూడేళ్లలో ఎటువంటి ఉపకరణాలను పొందని వారిని, యూడీఐడీ కార్డు కలిగి ఉన్నవారిని, మెడికల్ బోర్డు ద్వారా సదరంలో 40 శాతం పైబడిన వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్నవారిని, నెలకు రూ.15 వేల లోపు ఆదాయం కలిగిన వారిని అర్హులుగా పేర్కొంటూ 1050 మందిని ఉచిత ఉపకరణాలు అందించడానికి ఎంపిక చేశారు. 28వ తేదీ గురువారం యలమంచిలిలో, 29 శుక్రవారం నర్సీపట్నంలో ఇలాంటి ఎంపిక శిబిరాలను నిర్వహించనున్నట్టు దివ్యాంగుల సహాయ సంచాలకుడు జగదీష్ తెలిపారు.

5 ఎకరాల్లో ఎక్సైజ్ కాంప్లెక్స్

- ఆనందపురం మండలం గోరింటలో నిర్మాణం
- ఎక్సైజ్ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలోకి..
- నేడు భూమి పూజ చేయనున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి
- రూ.2.5 కోట్లతో ఏయూలో ఏర్పాటు చేసిన లేబొరేటరీ ప్రారంభం





ఏయూలోని రీజనల్ లేబొరేటరీలో పరీక్షలకు సిద్ధం చేసిన పరికరాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎక్సైజ్ శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటుకానున్నాయి. ఇందుకు ఆనందపురం మండలం గోరింట కేంద్రం కానుంది. ఇక్కడ ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఎక్సైజ్ కాంప్లెక్స్‌లో ఆ శాఖకు సంబంధించి అన్ని కార్యాలయాలతో పాటు మద్యం డిపో కూడా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఎక్సైజ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గురువారం డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి భూమి పూజ చేయనున్నారు. అలాగే కల్తీ మద్యానికి పూర్తిగా చెక్ పెట్టేందుకు రూ.2.5 కోట్లతో ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రీజినల్ లేబొరేటరీని కూడా డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారు. రానున్న రోజుల్లో ఎక్సైజ్ కాంప్లెక్స్‌లోనే ఆ శాఖ ప్రధాన కార్యాలయం కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. పరిపాలన రాజధానిగా మారుతున్న విశాఖలో క్రమంగా ఒక్కో శాఖకు సంబంధించిన ప్రధాన విభాగాలన్నీ తరలి వస్తున్నాయన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది.

అధునాతన లేబొరేటరీ

ఆంధ్ర విశ్వ విద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగం వెనుక దాదాపు రూ. 2.5 కోట్ల వ్యయంతో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ రీజినల్ లేబొరేటరీని ఏర్పాటు చేశారు. ఇందులో పూర్తిగా అత్యాధునిక ప్రయోగశాల, కార్యాలయం, గ్యాస్ చాంబర్, సెక్యూరిటీ గది, నిరంతరం 25 కేవీ విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు కల్పించారు. గ్యాస్ క్రోమాటోగ్రఫీ (జీసీహెచ్ఎస్), హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రఫీ(హెచ్‌పీఎల్‌సీ), అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రోస్కోపీ(ఏఏఎస్) వంటి పరికరాలను ప్రయోగశాలలో వినియోగిస్తున్నారు.

క్షుణ్ణంగా పరిశీలన

మద్యం తయారు చేసే డిస్టిలరీల్లో ఉపయోగించే పదార్థాల నుంచి వినియోగదారుడికి చేరే వరకు నిర్ణీత ప్రమాణాల మేరకు అన్నీ ఉండే విధంగా ఇక్కడ నిరంతర పర్యవేక్షణ జరగనుంది. అంతే కాకుండా బ్రాండ్ మిక్సింగ్‌తో పాటు మద్యంలో నీరు కలిపి విక్రయించే ఆగడాలకు కూడా ఇక అడ్డుకట్ట పడనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఐదు లేబొరేటరీలు ఏర్పాటు కానుండగా... విశాఖలోని ఏయూ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ లేబొరేటరీ ఉత్తరాంధ్ర జిల్లాలకు ఉపయోగకరంగా ఉంటుంది. మద్యం తయారీ పరిశ్రమల్లో బాటిలింగ్‌కు పంపే ముందు సంబంధిత శాంపిల్‌ను మొదటగా ఈ లేబొరేటరీకి పంపుతారు. దీనిని శాస్త్రీయంగా పరిశీలించి విశ్లేషించి.. బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నప్పుడే వాటిని అనుమతిస్తారు. ఒకవేళ పరీక్షలో నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా మద్యం లేదని తేలితే... వెంటనే తయారీ ప్రక్రియను నిలిపివేస్తారు.

అనుక్షణం పర్యవేక్షణ

ప్రస్తుతం మద్యంలో నీరు కలిపారా అనేది మాత్రమే తెలుసుకునే సాంకేతికత అందుబాటులో ఉంది. ఈ అత్యాధునిక ప్రయోగశాలలో ఏర్పాటు చేస్తున్న అధునాతన పరికరాల సహాయంతో... మద్యం తయారయ్యే డిస్టిలరీలలో ఉపయోగించే ఆల్కహాల్‌తో పాటు ఇతర పదార్థాల నాణ్యత, వాటిలో ఉండే ఇతర మలినాలను గుర్తించే అవకాశం ఉంది. అదే విధంగా బార్, రెస్టారెంట్‌లలో మద్యం విక్రయించే సమయంలో నీరు కలుపుతున్నారా? ఒకవేళ కలిపితే.. ఎంత శాతం కలిపారనేది కూడా ఇక సులభంగా ఇక్కడ గుర్తించే అవకాశం ఉంది. మరో వైపు తక్కువ ధర మద్యాన్ని అధిక ధర మద్యంలో కలిపి బ్రాండ్ మిక్సింగ్ చేసి.. అధిక ధరకు విక్రయించే విషయాన్ని కూడా ఈ లేబొరేటరీలో పరీక్షించి సులభంగా తేల్చవచ్చు. కల్తీ మద్యంతో పాటు మత్తు పదార్థాలకు సంబంధించిన శాస్త్రీయ పరీక్షలు ఇక్కడ జరగనున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్‌ను చాక్లెట్లు ఇతర రూపాల్లో విక్రయిస్తున్నారు. వీటిని శాస్త్రీయంగా పరీక్షించి, వాటిలో వినియోగించిన డ్రగ్, పరిమాణం వంటివి గుర్తించవచ్చు.

కల్తీ మద్యానికి చెక్

ఏయూలో ఏర్పాటు చేసిన అధునాతన లేబొరేటరీని డిప్యూటీ సీఎం ప్రారంభిస్తున్నారు. ఈ లేబొరేటరీ ద్వారా కల్తీ మద్యంను తయారీ దశలోనే నిలిపివేసే అవకాశం కలగనుంది. అంతేకాకుండా బార్లు, రెస్టారెంట్లలో జరిగే బ్రాండ్ మిక్సింగ్‌ను కూడా ఇట్టే పసిగట్టవచ్చు. ఇక ఆనందపురంలో ఏర్పాటు కానున్న ఎక్సైజ్ కాంప్లెక్స్‌లోని మా శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాలతో పాటు మద్యం డిపో కూడా ఏర్పాటు కానుంది.

– శ్రీకాంత్ రెడ్డి, ఎక్సైజ్‌శాఖ డీసీ

వచ్చే ఏడాది నుంచి వైద్య విద్య తరగతులు

- తోటి గిరిజనులకు సేవ చేసే అదృష్టం
- పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలత
- బాధ్యతల స్వీకరణ



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతను సత్కరిస్తున్న జిల్లా ఆస్పత్రి వైద్యనిపుణులు

సాక్షి,పాడేరు: వచ్చే ఏడాది నుంచి పాడేరు వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయని ఆ కళాశాల తొలి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలత పేర్కొన్నారు.కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో గైనిక్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమెను ప్రభుత్వం పాడేరులో అందుబాటులోకి రానున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై నియమించింది. ఆమె బుధవారం పాడేరు జిల్లా బోధన ఆస్పత్రిలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడారు. ప్రస్తుతం వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పాడేరు మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు అందుబాటులోకి వచ్చేంతవరకు జిల్లా బోధన ఆస్పత్రిలోనే అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది నుంచి మెడికల్ కళాశాల తరగతులను ప్రారంభించే ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. పాడేరు జిల్లా బోధన ఆస్పత్రిలో ప్రస్తుతం అదనంగా వార్డు గదులు, మరో 130 పడకలు ఏర్పాటుతోపాటు పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ఐదుగురు ప్రొఫెసర్లు విధుల్లో చేరారని, మిగిలిన వైద్యనిపుణులు, బోధన, బోధనేతర సిబ్బందిని త్వరలో నియమిస్తారన్నారు.

సంగీత అనుబంధ రంగాల్లో ఉపాధి

- సంగీత దర్శకుడు, సౌండ్ ఇంజినీర్, గాయకుడు సన్నీ ఎం.ఆర్
- ఏయూలో ఆడియో ల్యాబ్, వీడియో ఎడిటింగ్ స్టూడియో, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్ పనితీరును పరిశీలిస్తున్న రిజిస్ట్రార్, రెక్టార్

ఏయూ క్యాంపస్: ఆడియో, వీడియో సంబంధిత కోర్సులు అందిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తన ప్రత్యేకతను నిలుపుకుంటోందని ప్రముఖ సంగీత దర్శకుడు, సౌండ్ ఇంజినీర్, గాయకుడు సన్నీ ఎం.ఆర్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూలోని ఏయూ – సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్ మ్యూజిక్ ప్రొడక్షన్ కేంద్రం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆడియో ల్యాబ్, వీడియో ఎడిటింగ్ స్టూడియో, కంప్యూటర్ ల్యాబ్‌ను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సన్నీ మాట్లాడుతూ సంగీతానికి సంబంధించిన అనుబంధ రంగాలు ఎంతగానో అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. ఈ రంగంలో రాణించాలనుకునే యువతకు ఆంధ్ర విశ్వవిద్యాలయం– సెయింట్ లూక్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అధునాతన రికార్డింగ్ స్టూడియో, ల్యాబ్‌లో అందించే శిక్షణ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. మీడియా, చలనచిత్ర రంగాలు ఎంతగానో అభివృద్ధి చెందడంతో యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతమవుతున్నాయని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వీడియో ఎడిటింగ్, సౌండ్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన కోర్సులు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక లేబొరేటరీ, స్టూడియో ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తూ ఈ రంగంలో వారిని నిపుణులుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సంగీత దర్శకులు ఏయూ – సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ కేంద్రం నిర్వాహకులు ఆశీర్వాద్ లూక్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన సహకారంతో ప్రపంచస్థాయి రికార్డింగ్, ఎడిటింగ్ స్టూడియో సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత తదితరులు మాట్లాడారు.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్య అందించాలి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కొవ్వూరు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రోలుగుంట: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు మెరుగైన బోధనతో పాటు, వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. రోలుగుంటలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం కొవ్వూరు జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వారి ఆరోగ్యం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేముడును అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ అధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం అక్కడికి వచ్చి తనను కలిసిన ఎంపీపీ శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మతో గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ఇతర అంశాలపై చర్చించారు.

పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

- జిల్లా పర్యాటక అధికారి అశోక్

తుమ్మపాల: జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా పర్యాటక అధికారి అశోక్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బృందావనం హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వదేశ్ దర్శన్ పథకంలో రాష్ట్రంలోని బౌద్ధ సర్క్యూట్‌ల అభివృద్ధిలో భాగంగా బొజ్జన్నకొండ అభివృద్ధికి భారత ప్రభుత్వం రూ.7.32 లక్షలు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో కొండకర్ల ఆవ, బొజ్జన్నకొండ, ఏటికొప్పాక బొమ్మలు, ఉపమాక వేంకటేశ్వర ఆలయం, పంచదార్ల, పట్టణంలోని నూకాలమ్మ, మాడుగుల మోదకొండమ్మ, చోడవరం ఆలయాలు, సముద్రతీర బీచ్‌ల వంటి ఆహ్లాదకరమైన ప్రదేశాలు ఉన్నాయన్నారు. పర్యాటక పరంగా ఆయా ప్రాంతాల అభివృద్ధితో పాటు ఉపాధి రంగాలు కూడా పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రత్యేక కార్యక్రమాలు, పండగలు నిర్వహిస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి 2020–25 టూరిజం పాలసీని పునర్నిర్మించి, పెట్టుబడుల కొరకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఏపీలో టూరిజం ప్రగతికి ఏపీ టూరిజం ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ 2020ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

రేపటి నుంచి ఏపీఈఆర్సీ విచారణ

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ వినియోగదారుల అర్జీలపై విచారణ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) మూడు రోజుల పాటు పర్యటించనుంది. ఈ నెల 29, 30, అక్టోబర్ 1వ తేదీల్లో ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.వెంకట్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించనున్నారు. ఇప్పటికే గృహ వినియోగదారులు, పరిశ్రమలు, వివిధ సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై ఈ విచారణ జరగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఏపీఈఆర్సీ క్యాంపు కార్యాలయం విశాఖలోని ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేపథ్యంలో అక్కడి నుంచే కీలక హియరింగ్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకటరమణ



శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. శ్రీవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. టీటీడీ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వాదం అందజేశారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.01 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 35 రోజులకి రూ.2.01 కోట్లు వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై బుధవారం హుండీల ఆదాయం లెక్కించారు. నగదుతోపాటు 136 గ్రాముల బంగారం, 15.250 కిలోల వెండి లభించాయి.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన దిలీప్‌కుమార్



దంతులూరి దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ ఆథారటీ బోర్డ్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్‌ను కలెక్టర్ అభినందించారు. నూతన జిల్లాకు తొలి కలెక్టర్‌గా వచ్చి ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని దిలీప్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తాము కూడా ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

ఉప్పవరం రైతు భరోసా కేంద్రంలో చోరీ



ఆర్‌బీకే వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రైతు భరోసా కేంద్రంలోని కంప్యూటర్,టీవీ, ఫ్యాన్ చోరీ అయ్యాయి.రైతు భరోసా కేంద్రం ఉద్యోగి లోకేష్ ఫిర్యాదు మేరకు అచ్యుతాపురం ఎస్‌ఐ సన్యాసినాయుడు రైతు భరోసా కేంద్రం పరిసరాలను పరిశీలించారు.త్వరలోనే దొంగల్ని పట్టుకుంటామని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చక్కని మార్గం

జగనన్నకు చెబుదాం..



ఎంపీడీవో కార్యాలయం వద్ద బారులు తీరిన అర్జీదారులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

- రోలుగుంటలో భారీ 'స్పందన'
- అర్జీలతో బారులు తీరిన జనం
- 270 వినతులు స్వీకరించిన అధికారులు
- రెవెన్యూ సమస్యలే అధికం
- పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రోలుగుంట: సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రానికి వెళ్లే బాధను ప్రజలకు తప్పించేందుకు, నేరుగా అధికారులే మండల కేంద్రాలకు వెళ్లి, ప్రజల సమస్యలు విని పరిష్కార మార్గాలు చూపేందుకు మండలస్థాయిలోనే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నాతవరం, బుచ్చెయ్యపేట, రావికమతం తదితర మండలాలలో జిల్లాస్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలకు పరిష్కార మార్గం చూపారు. దీనిలో భాగంగానే బుధవారం రోలుగుంట మండల కేంద్రం స్త్రీశక్తి భవన్‌లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో ఉదయం సుమారు 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలు అర్జీలు నమోదు చేసేందుకు 10 కౌంటర్లు ఏర్పాటు చేశారు, నమోదైన అర్జీలకు టోకెన్‌లు ఇచ్చేందుకు కార్యాలయం బయట రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. తరువాత ప్రజలు నేరుగా కలెక్టర్‌ను కలసి వారి సమస్యలను చెప్పుకున్నారు. అందరి సమస్యలను కలెక్టర్ ఎంతో శ్రద్ధగా విన్నారు. మీ సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గం చూపుతానని భరోసా ఇచ్చారు. బుధవారం నాటి ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 370 మంది నుంచి అర్జీలను కలెక్టర్ రవి పటాన్ శెట్టి, జేసీ జాహ్నవి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను శాఖల వారీగా క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని, నాడు–నేడు భవనాలను అన్ని హంగులతో నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయించాలని ఉపాధ్యాయులకు, పీఆర్ జేఈకి కలెక్టర్ సూచించారు. వెల్‌నెస్ భవనాలు, రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణస్థాయి, వాటి నిర్మాణంలో సమస్యలేమైనా ఉన్నాయా అని ఆశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే చేసి బడి బయట బాలికల్లో రక్త హీనత సమస్యను పరిష్కరించాలని వైద్యులకు సూచించారు. గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు చేసి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 5 నుంచి 8 సంవత్సరాల పిల్లలను గుర్తించి పాఠశాలల్లో ప్రవేశాలు జరిగేలా ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యత వహించాలని ఆదేశించారు.



స్పందనలో పాల్గొన్న జిల్లాస్థాయి అధికారులు

అర్జీల్లో కొన్ని..

- అర్ల, లోసింగి తదితర గిరిజన గ్రామాలకు రవాణామార్గం మెరుగుపరచి, ఈ గ్రామాలకు ఒక పాఠశాల ఏర్పాటుతో పాటు రెగ్యులర్ ఉపాధ్యాయుడు నియామకం జరపాలని ఆ ప్రాంత గిరిజనులు అర్జీ అందజేశారు.
- ఇటీవల జరిగిన భూసర్వేలో తేడాలున్నాయని, రీసర్వే ద్వారా సరిచేయాలని రోలుగుంట, మరో గ్రామానికి చెందిన వారు దరఖాస్తు చేసుకున్నారు.
- గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారించాలనే వినతులను పలువురు అందజేశారు.

వారానికి రెండు సార్లు 'జగనన్నకు చెబుదాం'

ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ వచ్చిన వినతుల్లో రెవెన్యూ సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. 'డి' పట్టా లివ్వాలని పలువురు అర్జీలు అందజేసినట్టు చెప్పారు. ఇంటి గొడవలు, భూముల గొడవలకు సంబంధించిన సివిల్ సమస్యలపై వచ్చిన వినతులు పరిష్కారానికి సమయం పడుతుందని వివరించారు. వారానికి జిల్లాలో రెండు మండలాలులో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి సోమవారం కూడా కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల కోసం అవసరమైన టెంట్‌లు, ప్రాథమిక వైద్య శిబిరాలు, తదితర ఏర్పాట్లను ఎంపీడీవో ప్రభాకరరావు, తహసీల్దార్ వరహాలు దగ్గరుండి చేశారు.

ప్రజా మద్దతుతో ఉక్కుపరిరక్షణ పోరాటం



అనకాపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గఫూర్



యలమంచిలిలో బైక్‌యాత్రకు హాజరైన విద్యార్థులు,సీపీఎం నాయకులు

యలమంచిలి/రాంబిల్లి/అనకాపల్లి రూరల్/అచ్యుతాపురం(అనకాపల్లి) : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకుంటున్నట్టు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేవరకు ఉక్కు సంకల్పంతో ప్రజలంతా రాజీలేని పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు.ఉక్కు రక్షణ యాత్ర పేరుతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆ పార్టీ నాయకులు చేపడుతున్న బైక్ యాత్ర బుధవారం యలమంచిలి, రాంబిల్లి, అనకాపల్లి పట్టణం, అచ్యుతాపురాల్లో సాగింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో భారీ ఎత్తు బైక్ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో గఫూర్ ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ప్రజల మద్దతుతో ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ పోరాటానికి అన్ని వర్గాల వారు కలిసి రావలన్నారు. సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి బి.జగన్,అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె. లోకనాథం,జిల్లా కార్యవర్గ సభ్యుడు రుత్తల శంకరరావు,అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, దేముడునాయుడు, డిమాండ్ చేశారు. సీపీఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్. రాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు

అనకాపల్లిటౌన్: మారుతున్న వాతావరణ పరిస్థితిల్లో మొక్కజొన్న సాగు విస్తీర్ణ పెరుగుతుందని, మొక్క జొన్న సాగు అన్ని ప్రాంతాలకు అనుకూలంగా ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం రైతులకు, విద్యార్థులకు 'మొక్కజొన్న కత్తెర పురుగు సమగ్ర యాజమాన్య పద్ధతులు' పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మొక్కజొన్నను కత్తెరపురుగు ఆశిస్తోందని, శాస్త్రవేత్తలు ఆదేశాల మేరకు కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వ్యవసాయశాఖ జిల్లా వనరులకేంద్రం సహాయసంచాలకులు శ్రీధర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో మొక్కజొన్న విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. అనేక రకాలైన పంటలకు జొన్న ప్రత్యామ్నాయ పంటగా ఉందని ఆయన చెప్పారు. పరిశోధనాకేంద్రం కీటక విభాగం ప్రధానశాస్త్రవేత్త ఎం.విశాలాక్షీ మాట్లాడుతూ కత్తెర పురుగు యాజమాన్యంపై ఎన్‌బీఏఐఆర్, బెంగళూర్ వారి సహకారంతో వివిధ పరిశోధనలను పరిశోధన స్థానంలో రైతుల పొలాల్లో నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. కత్తెర పురుగు సమగ్ర యాజమాన్య పద్ధతులైన జీవ నియంత్రణ, రసాయన యాజమాన్య పద్ధతులను గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో చెరకు ప్రధానశాస్త్రవేత్త బి.ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు సీహెచ్.ముకుందరావు, కె.వి.రమణమూర్తి, ఆర్.సరిత, పి.శ్రీదేవి, రావులమ్మ, డి.ఉమామహేశ్వరరావు, ఎంబీజీఎస్ కుమారి, కె.శిరీషా, గోపాలస్వామి, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 40 మంది రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథరావు

సంత పాకలు అగ్నికి ఆహుతి



అగ్నికి ఆహుతవుతున్న అచ్యుతాపురం సంత పాకలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న సంత పాకలు బుధవారం అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ పారేయడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. సుమారు 12 పాకలు ఒకటి తర్వాత మరొకటి పూర్తి కాలిపోయాయి. అగ్నిమాపక బృందం రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నారు.

పప్పు దినుసుల దుకాణాల తనిఖీ



జోగారావు షాపులో కందిపప్పు తనిఖీ చేస్తున్న సీఐ కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్ : పట్టణంలో రెండు ట్రేడర్ల దుకాణాల్లో పప్పుదినుసులను పరిశీలించి కేసులు నమోదు చేయడం జరిగిందని విశాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలో శ్రీధరాల జోగారావు, కన్యకాపరమేశ్వరి ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. జోగారావు ట్రేడర్స్‌లో 10 ప్యాకెట్లు కందిపప్పుతోపాటు ఐదు కేజీల మినగపప్పు మూడు ప్యాకెట్లు, కన్యకాపరమేశ్వరి ట్రేడర్స్ కంపెనీలో 50 కేజీల మినగపప్పు బ్యాగ్‌ను రెండు విధాలుగా విభజించి, వేరే దానిలో వేస్తుండగా కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. దీంతోపాటు మరో ఐదుషాపుల్లో తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వస్తువుపై ధరతోపాటు వాటి కాలపరిమితి తేదీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. త్వరలో మరిన్ని దుకాణాలు తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలు చోరీ

మాకవరపాలెం: భీమబోయినపాలెంలో పట్టపగలే 10 తులాల బంగారం చోరీకి గురైంది. ఈ గ్రామానికి చెందిన లాలం లక్ష్మి ఇంట్లో బుధవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వెనుక ఉన్న తలుపులు తెరిచి లోపలికి ప్రవేశించారు. బీరువాలో లాకర్ పగులగొట్టి లోపల 10 తులాల బంగారం, 30 తులాల వెండి, నగదు చోరీ చేశారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, ఎస్‌ఐ రామకృష్ణారావు, క్లూస్‌బృందంతో సహా ఘటనాస్థలికి చేరుకుని, వివరాలు సేకరించారు.

వీఆర్పీ అనంతకు సస్పెన్షన్ ఉత్తర్వుల జారీ

రోలుగుంట : బుచ్చింపేటకు చెందిన వీఆర్పీ గాలి అనంత ఉపాధి పథకంలో పాల్పడిన అవకతవకలు రుజువు కావడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గ్రామంలో జరిగిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో పలు అవకతవకలకు పాల్పడినట్టు పలువురు ఉపాధి కూలీలు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఈ ఏడాది జూన్ 18 న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డ్వామా ఏపీడీ రోజారాణి విచారణ చేసి ఆ నివేదికను కలెక్టర్ రవి పటాన్‌శెట్టికి అందజేశారు. అవకతవకలు జరిగినట్టు రుజువవడంతో వీఆర్పీని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి

సీతమ్మధార (విశాఖ ఉత్తర): రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సీతమ్మధార ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి ఎదురుగా గల కేవీఆర్ ఎస్టేట్ భవనంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సిబ్బంది, కుటుంబ సభ్యుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. కేవీఆర్ సోదరుడు, కేవీఆర్ ఎస్టేట్ మేనేజింగ్ పార్టనర్ కాయల సూరారెడ్డి, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, వీకేపీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, వార్డు ఇన్‌చార్జి కర్రి మురళీకృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు కాయల వెంకటరెడ్డిని గజామాలలతో సత్కరించారు. తన కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాను ప్రజల మనిషినని, జగనన్న మనిషినని అభిమానులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బొడ్డు అప్పల నాయుడు (ఫైల్)

అనకాపల్లిటౌన్: ద్విచక్రవాహనం ఢీకొని బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామీణ ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో రొంగలివానిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు అప్పలనాయుడు(60)తన ద్విచక్రవాహనంపై పట్టణంలోకి వస్తుండగా అదే రహదారిలో వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ఘటనలో అప్పలనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

కొమిర సచివాలయ సర్వేయర్ మోసీన్ సస్పెన్షన్

రావికమతం: కొమిర సచివాలయ సర్వేయర్ మహమ్మద్ మోసిన్ సస్పెండ్ అయినట్టు తహసీల్దార్ మహేశ్వరరావు బుధవారం తెలిపారు. విధి నిర్వహణలో మోసిన్ అలసత్వం వహిస్తున్నట్టు జిల్లా సర్వే అధికారి ఎస్.గోపాలరాజా గతంలో గుర్తించి పలు మార్లు హెచ్చరించారన్నారు. అయినప్పటికీ అతనిలో మార్పు రాకపోవడంతో సస్పెండ్ చేస్తూ జిల్లా సర్వే అధికారి ఇచ్చిన ఉత్తర్వులు మండల రెవెన్యూ కార్యాలయానికి బుధవారం అందాయని చెప్పారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చినట్టు తహసీల్దార్ మహేశ్వరరావు చెప్పారు.

ఉత్కంఠగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



అండర్ 19 క్రికెట్ జిల్లా జట్టు క్రీడాకారులతో సెలెక్టర్లు



అండర్ 19 బాలికల ఖోఖో జిల్లా జట్టు



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి జట్ల ఎంపికలు బుధవారం జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా అండర్ 19 క్రికెట్,ఖోఖో జిల్లా జట్ల ఎంపికలు కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల క్రీడా మైదానంలో ఉత్కంఠగా జరిగాయి.రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి.బాల బాలికల విభాగంలో జిల్లా జట్ల ఎంపికల కోసం నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన బాల బాలికల జట్లు వచ్చే నెలలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీల్లో తలపడతాయి. ఈ ఎంపికల పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.రాంబాబు పర్యవేక్షణలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఫిజికల్ డైరెక్టర్లు నిర్వహించారు. మొత్తం 300 మందికి పైగా బాలబాలికలు ఎంపికల్లో పాల్గొని జిల్లా జట్టులో చోటు కోసం పోటీపడ్డారు. అండర్ 19 క్రికెట్ జట్టు ఎంపికలకు న్యాయనిర్ణేతగా యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.పోలిరెడ్డి వ్యవహరించారు.పోటీలు ముగిసిన అనంతరం బుధవారం సాయంత్రం ఎంపికైన క్రీడాకారుల పేర్లను సెలెక్టర్లు అధికారికంగా ప్రకటించారు. అంతకుముందు ఎంపికల పోటీలనుద్దేశించి ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు,గౌరవం లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఏఎల్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కల్లూరు మంగరాజు,కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.మహేశ్వరరావు,కళాశాల సూపరింటెండెంట్ పి.అనూరాధ, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ కెవిఎస్ నాయుడు,వై నాయుడు పలువురు స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పీఎస్‌రాజు

అట్టహాసంగా బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

యలమంచిలి: జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు యలమంచిలి పట్టణం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీపీ బోదెపు గోవింద్ ప్రారంభించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 15 నియోజకవర్గాల నుంచి వచ్చిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు క్రీడల కన్వీనర్ వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, కౌన్సిలర్లు వెంకట్, దూది నర్సింహమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు సేనాపతి రాము, ఎంఈవో అరుణ్‌కుమార్,ప్రధానోపాధ్యాయులు వై.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీలు ...

పరవాడ/అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీలు పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 15 నియోజకవర్గాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 17 (బాలురు, బాలికలు) విభాగాల్లో పోటీలు నిర్వహించి ఎంపికలు చేపట్టారు. పోటీలను ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు (పీఎస్‌రాజు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయిలో తలపడనున్న జట్లను ఎంపిక చేశారు. వీరికి క్రీడా దుస్తులకు గ్రామ సర్పంచ్ నాగమణి, ఆమె కుమారుడు కబడ్డీ అప్పారావు రూ.10 వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు దివాకర్, గొంతిన సాయి శైలజ, పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణ, గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, కబడ్డీ అప్పారావు, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, పాఠశాల పీడీ ఎన్.వి.రమణ, వైఎస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు తదితరులు పాల్గొన్నారు. బహుమతుల అందజేత క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ రవిబాబు పాల్గొని బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ దాలిబోయిన పైడిరాజు, సభ్యులు కె.సత్యనారాయణ, వై.బుజ్జి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి దుర్గమాంబ ఉత్సవాలు



కశింకోట: స్థానికగవరపేటలో వెలసిన దుర్గమాంబ ఉత్సవాలు గురువారం సాయంత్రం పెద్ద ఎత్తున ప్రారంభించేందుకు సన్నాహాలు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ముందుగా అలంకరించిన పల్లకిలో గరగను డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి, సమీపంలోని కనకమహాలక్ష్మి ఆలయం వెనుక ఉన్న అమ్మవారి పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారి ప్రతి రూపాన్ని పల్లకిలో నిలిపి గ్రామం అంతటా ఊరేగిస్తామన్నారు. ఈ సందర్భంగా థింసా నృత్యం, బోనాల నృత్యం, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళల కోలాటాలు, తోడపెద్దు సేవలు, చిటికెన భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పుల మేళాలు, భారీ బాణసంచా వెలుగుల్లో వైభోగంగా ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. అమ్మ వారి ప్రతి రూపాన్ని ఆలయంలో నిలిపి వారం రోజులపాటు పూజలు నిర్వహించి, అక్టోబర్ 5న పండగ జరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి న్యాయవాదుల ధర్నా



న్యాయ సముదాయం ముందు ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లిటౌన్: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ న్యాయవాదులు స్థానిక న్యాయ సముదాయం ముందు బుధవారం ధర్నా చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడారు. పట్టణంలో నూతన న్యాయసముదాయాన్ని నిర్మించాలని కోరారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, డెత్ బెనిఫిట్స్ రూ.12 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుధాకర్, హరశ్రీనివాసరావు, మాధవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, న్యాయవాదులు కేవీఆర్ నాయుడు, నూకరాజు, సురేష్‌బాబు, కుసుమ, రోజా, శ్రీరామ్మూర్తి, మైఖేల్, బి.రమణ, కామేశ్వరరావు, రాపర్తి రామారావు, దొమ్మేసి అప్పారావు, భూపతి, రామకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

7/జీ బృందావనకాలనీ(మార్నింగ్, సెకండ్‌షో)
వారెవ్వా జతగాళ్లు(మధ్యాహ్నం- సాయంత్రం) : రాజా
మార్క్ ఆంటోని : సత్యనారాయణస్క్రీన్-1
కలివీరుడు : సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి : షిర్డిసాయి
జవాన్ : పర్తిసాయి
జవాన్ : వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్ : శ్రీసత్య
బెదురులంక-2012 : రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 361 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,320	4,540
రెండో రకం	3,030	4,270
మూడోరకం	3,800	4.010

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, బీ పాజిటివ్-27 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వెళ్లిరా వినాయకా

జై గణేశా.. జైజై గణేశా.. గణపతి బప్పా మోరియా.. అంటూ వినాయక నామస్మరణతో ఊరూవాడా మార్మోగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పూజలందుకున్న గణనాథుల్ని చివరి రోజైన బుధవారం భారీగా ఊరేగించి, వేడుకగా నిమజ్జనం చేశారు.



శారదానది ఘాట్ వద్ద గణపతితో శ్రీనుయాదవ్, కమిటీ సభ్యులు

- ఘనంగా వినాయక నిమజ్జనోత్సవాలు
- భారీ వర్షంలోనూ వేడుకగా ఊరేగింపులు

అనకాపల్లిటౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక డైట్ కళాశాలలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ గణనాథుడ్ని తలపై మోసుకుంటూ నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీధర్‌లాడ్జి మెహర్‌బాబావీధిలో శ్రీనుయాదవ్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. సన్నాయి మేళం, డప్పుల వాయిద్యాల నడుమ స్థానిక శారదానది ఘాట్ వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నది వద్ద వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పొక్లెయిన్ సాయంతో భారీ గణపతి విగ్రహాలను నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానికంగా యువత ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధనలు జరిగాయి.

సంతబయల అన్నపూర్ణాదేవి ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. కుంచావారివీధి గౌరీపరమేశ్వరుల ఆలయంలో, భట్లపూడి రామాలయం ప్రాంగణంలో పూజలందుకున్న గణపతి విగ్రహాలను సాయంత్రం ఊరేగించి, నేత్రపర్వంగా నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను సర్పంచ్ గొంతిన సజావతి, సత్యారావు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ నొట్ల శంకర శేఖరరావు, భక్తులు పాల్గొన్నారు.



గణపతిని తలపై మోసుకెళ్తున్న డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్



కశింకోటలో రిక్షాపై వినాయక విగ్రహ ఊరేగింపు

కశింకోట: వినాయక నిమజ్జనోత్సవాలు బుధవారం పెద్ద ఎత్తున జరిగాయి. వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగియడం, బుధవారం భక్తులకు సెంటిమెంట్ రోజు కావడంతో దాదాపు అన్ని వీధుల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ డప్పులు, సన్నాయి మేళాలు, వాయిద్యాలతో వ్యానులు, రిక్షాలు, తల మీద ఉంచి గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తడుస్తూనే నిమజ్జనోత్సవాలను నిర్వహించారు. గవరపేట, కస్పావీధి, గోవిందరావు కాలనీ, సాయినగర్ కాలనీ, మేదరవీధి, కనకమహాలక్ష్మి వీధి, పాల కేంద్రం వీధి, గాడివీధి తదితర ప్రాంతల్లోని వినాయక విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మధ్యాహ్నం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. పాల కేంద్రం వీధిలో పవర్ వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావుల సమక్షంలో భారీ అన్న సమారాధన జరిపారు. లడ్డూ వేలం పాట నిర్వహించారు. సుగర్ ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగి భీశెట్టి వేణుగోపాల్ దంపతులు రూ.6 వేలకు దక్కించుకున్నారు. దీన్ని వైస్ ఎంపీపీ జ్యోతి దంపతుల చేతుల మీదుగా వారికి అందించారు. గ్రామంలో ఉదయం నుంచి ఒకటొకటిగా ప్రారంభమైన నిమజ్జనోత్సవాలు, సాయంత్రం ముమ్మరమై దాదాపు అర్ధరాత్రి దాటే వరకు కొనసాగాయి. స్థానిక గవరపేటలోని పెద్ద గుమ్మం, కాశీమదుం గ్రోయిన్, గాడి వీధి ప్రాంతాల్లోని శారదా నదిలో వినాయక ప్రతిమలను సంప్రదాయంగా పూజలు జరిపి, నిమజ్జనం చేశారు. ప్రజలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో నదీ ప్రాంతం ప్రజలతో కళకళలాడింది. మండలంలోని పలు గ్రామాల్లో కూడా వినాయక నిమజ్జనోత్సవాలు జరిగాయి.



కుంచావారి వీధి గణపతి ఊరేగింపులో యువకులు



వర్షంలో వినాయకుడికి గొడుగు వేసి తీసుకెళ్తున్న భక్తులు



భారీ గణపతి విగ్రహానికి పొక్లెయిన్ సాయంతో నిమజ్జనం



పెద్దగుమ్మం వీధిలో శారదానది తీరాన వినాయక నిమజ్జన పూజలు



గణేష్ విగ్రహాన్ని నదిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



శారదానదిలో వినాయక విగ్రహాలతో మహిళలు



కశింకోటలోని పాల కేంద్రం లడ్డూ వేలం పాటలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి



వ్యాన్‌పై వినాయక నిమజ్జనోత్సవ ఊరేగింపు

ఘనంగా పొట్టి శ్రీరాములు భవనం వార్షికోత్సవం



పుస్తకాలను పంపిణీ చేస్తున్న జగన్నాథరావు నాయుడు

అనకాపల్లిటౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కొణతాల జగన్నాథరావు నాయుడు కోరారు. స్థానిక న్యాయ సముదాయం ఎదురుగా పొట్టి శ్రీరాములు భవన 22వ వార్షికోత్సవ కార్యక్రమాలను బుధవారం ఆయన ప్రారంభించారు. తొలుత శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గానికి చెందిన పిరాట్ల నరసింహమూర్తి ఈ భవనాన్ని ఏర్పాటు చేసి, 22 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఏడాది పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పొట్టి శ్రీరాముల జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ లాయర్ ఆళ్లపాటి సుబ్బారావు, సినీ నిర్మాత సీహెచ్‌వీఎస్ బాబ్జి, జామి గ్రామం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విన్నకోట సీతారామయ్య, బీజేపీ నాయకులు గంగుపాం నాగేశ్వరరావు, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

కశింకోట: కశింకోట ప్రాంతంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. వరి పొలాలు, నాట్లకు ఈ వర్షం బాగా ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పగటి పూట అంతా బాగా ఎండ కాసి, సాయంత్రం చిన్నగా మేఘం వేసి, అకస్మాత్తుగా వాన మొదలయింది. గ్రామంలో కొంత భాగంలో మాత్రమే వర్షం ప్రారంభమైంది. దీంతో ఇదేమి చిత్రం అంటూ స్థానికులు విస్తుపోయారు. ఆ తర్వాత కొంతసేపటికి గ్రామం అంతటా విస్తరించి భారీ వర్షం కురిసింది. వీధుల్లో నీరు ఏరులై పారింది. వర్షం తగ్గిపోవడంతో వీధుల్లో నీరు ప్రవాహం తగ్గి, యథాస్థితికి చేరుకుంది. ఈ వర్షం ఖరీఫ్ వరి నాట్లు వేసిన పొలాలు, చెరకు తోటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వర్షంలో గొడుగు వేసుకుని రాకపోకలు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కను నాటుతున్న భారత్ వికాస పరిషత్ జిల్లా శాఖ సభ్యులు

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఇంటి వద్ద మొక్కలను నాటి, వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని భారత వికాస పరిషత్ అనకాపల్లి శాఖ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్ కోరారు. పరిషత్ ఆధ్వర్యంలో బొజ్జన్నకొండ వద్ద బుధవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనేక స్వచ్ఛంధ సంస్థలు మొక్కలను నాటుతున్నాయని, వాటి పర్యవేక్షణ కూడా చూడాలని సూచించారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటాలన్నారు. కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటడమే పరిష్కారమన్నారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి ఏబీ వర్మ, కోశాధికారి డి.శివరాం, సీనియర్ సభ్యులు జీఎస్ఆర్ శేషగిరి, కేశవరావు, పిళ్లా నిర్మల, సిల్లా గోపాలరావు, శరగడం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీడీ మదన్మోహన్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తరగతికి చెందిన ఉదయ్‌కిరణ్, కిలపర్తి కుమార్‌లు హరిపాలెం హైస్కూల్లో తాజాగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వెల్లడించారు. వారిని అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా గెలుపొందాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిత



విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన బోధన చేయాల్సిందిగా ఉపాధ్యాయులను ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. మండలంలోని కోడూరు యూపీ స్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. భావితరాల విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని డిజిటల్ తరగతులతో పాటు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో బోధన అందిస్తోందన్నారు. గ్రామీణ విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అంతకుముందు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

బొజ్జన్నకొండ అభివృద్ధి చర్యలపై ఆనందం



ఎంపీ సత్యవతిని శాలువాతో సత్కరిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి మండలం శంకరం పంచాయతీలోని బొజ్జన్నకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం పట్ల సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ బీవీ సత్యవతిని అసోసియేషన్ సభ్యులు శాలువాతో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొజ్జన్న కొండను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే దిశగా రూ.7.30 కోట్లతో కాటేజీలు, ఇతర మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ పర్యాటకులకు, బౌద్ధ భిక్షువులను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో సంఘ ఉపాధ్యక్షుడు వినకోట నీలేశ్‌గుప్తా, సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



గణపతికి పూజలు చేస్తున్న ఎంపీ దంపతులు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎంపీ దంపతులు, బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్, భీశెట్టి వరహా సత్యవతి

అనకాపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనకు అలవాటుపడితే మానసిక ప్రశాంతత పొందుతారని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. తన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మందిరంలో బుధవారం గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణపతి నవరాత్రి వేడుకలు ముగియగానే దుర్గా నవరాత్రులు వస్తాయని, ఆ వేడుకలునూ భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహాసత్యవతి, మాజీ మున్సిపల్ చైర్మన్ కొణతాల జగన్నాథరావు, మంత్రి గుడివాడ అమర్ భార్య హిమగౌరీలను ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



స్వామివారిని దర్శించుకుంటున్న హిమగౌరి

అనకాపల్లిటౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు పులఖండం గిరిబాబు, విజయ్‌బాబులు చక్రస్నానం, హోమం, ధ్రువమూర్తికి ఏకోత్తర సహస్ర కళశాలతో అభిషేకం అష్టోత్తర పూజ చేశారు. సాయంత్రం ధ్వజారోహణ, లక్ష తులసి, లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. అంతకు ముందు స్వామివారిని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఈవో కె.ఆదినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుణ బకాయిలు సత్వరమే చెల్లించాలి



నరసింగబిల్లి పీఏసీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాయుడుబాబు

కశింకోట: సంఘ అభివృద్ధి దృష్ట్యా వాయిదా మీరిన రుణ బకాయిలను సభ్యులు సత్వరమే చెల్లించాలని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వ సమావేశం కోరింది. సంఘ చైర్‌పర్సన్ గండి నాయుడుబాబు అధ్యక్షతన బుధవారం నరసింగబిల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణ బకాయిలు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సభ తీర్మానించారు. ఈ ఏడాది సంఘం ద్వారా రూ.కోటి 57 లక్షల రుణాలను రైతులకు అందించినట్లు చైర్‌పర్సన్ నాయుడు బాబు తెలిపారు. 2022-23 సంవత్సరం ఆడిట్ నివేదిక, వాస్తవ బడ్జెట్, 2023-24 అంచనా బడ్జెట్‌ను ఆమోదించింది. డీసీసీబీ నుంచి వాటా ధనంపై వచ్చిన రూ. 3.87 లక్షల డివిడెంట్‌ను సంఘ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి వినియోగించాలని తీర్మానించారు. సమావేశంలో డైరెక్టర్ మజ్జినాయుడు, సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం తగ్గించాలని వినతి



నెహ్రూచౌక్ నుంచి ర్యాలీగా వెళ్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అనకాపల్లి రూరల్: భారంగా మారిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ వామపక్ష పార్టీల నాయకులు పట్టణంలో బుధవారం ఆందోళన చేపట్టారు. స్థానిక నెహ్రూచౌక్ కూడలి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, ఆర్డీవో చిన్నికృష్ణకు వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరిట ప్రజలపై మోపుతున్న భారాన్ని, రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై భద్రం, దొరబాబు, విజయలక్ష్మి, సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, జి.నాయనబాబు, సుభాషిణి, బి.ఉమామహేశ్వరరావు, బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

కశింకోట:స్థానికపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనకాపల్లి పీవీఆర్ దంత వైద్యశాల వైద్యులు పట్నాయకుని వెంకటేష్, నితిన్ హాజరై రోగులను పరీక్షించి, దంతక్షయం నివారణ టూత్‌పేస్టులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజమెన్, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.